ప్రజాశక్తి
ఆదివారం 26 నవంబర్ 2023
5
అనంతపురం

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతిచూపాలి

లక్ష్యాన్ని చేరుకోకపోతే కఠిన చర్యలు : కలెక్టర్

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేటాయించిన ఇళ్ల నిర్మాణ లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నిర్ధేశించిన లక్ష్యాన్ని చేరుకోకపోతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం నాడు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు కింద ఇళ్ల నిర్మాణంపై హౌసింగ్ పీడీ నరసింహారెడ్డి, హౌసింగ్ ఈఈ, డిఈలు, ఏఈలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ నెల యాక్షన్ ప్లాన్ ప్రకారం కేటాయించిన లక్ష్యాన్ని నెలాఖరులోపు ఎటువంటి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని ఆయా మండలాల అధికారులను ఆదేశించారు. కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయకపోతే సంబంధిత మండలాల అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పైకప్పు స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలు పైకప్పును వేసుకోవాలన్నారు. పైకప్పు వేసుకున్న వారు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. రెండు మూడు రోజుల్లో అన్ని ప్రాంతాలకు సరిపడేంత ఇసుకను సరఫరా చేస్తామన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడాలన్నారు. లబ్ధిదారులకు ఆర్థికపరమైన సమస్య ఉంటే డీఆర్డీఏ మెప్మా ద్వారా రుణాలు అందించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి జనవరి 31వ తేదీ వరకు ఇళ్ల నిర్మాణాల పూర్తి కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. జనవరి నెలాఖరుకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేసి రెండవ విడత మెగా గృహప్రవేశాల కార్యక్రమానికి అన్ని విధాల సిద్ధంగా ఉండాలన్నారు.

సం'కుల'సమరం..!

ఎన్నికలు సమీస్తున్న తరుణంలో కులాల సమరం మొదలైంది. వచ్చే ఎన్నికల్లో తమ కులానికి ప్రాధాన్యత కల్పించాలన్న డిమాండ్లను వినిపిస్తున్నాయి. అయితే వీటి వెనుక ఆయా రాజకీయపార్టీల నేతలూ ఉంటుండటం గమనార్హం. మొత్తంగా ఆ కులాల మద్దతును కూడగట్టుకునేందుకు ప్రధాన రాజకీయపార్టీలు ప్రయత్నిస్తున్నాయి. తాము అధిక ప్రాధాన్యతనిచ్చామంటే.. తామూ ఇచ్చామంటూ చెప్పకుని ఆ కులం మద్దతు పొందే ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం.

◆ ఎన్నికల వేళ కుల సంఘాల కోలాహలం ◆ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలో కురుబసంఘం గుడికట్ల సంబరాల పేరుతో పెద్దఎత్తున కుల సమీకరణ చేపట్టారు. భారీగా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. 250 గుడికట్లు కూడా వచ్చాయి. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయపార్టీల నుంచి నేతలు పాల్గొని ఆ కులంలో తమకు మద్దతు ఉన్నట్టు చాటి చెప్పే ప్రయత్నం చేశారు. ఇందులోనూ గోరంట్ల మాధవ్, బికె.పార్థసారథిల మధ్య వివాదం చోటు చేసుకుంది. రాజకీయాలకు అతీతమైన ఈ సభలో వివాదం సరైంది కాదని కుల పెద్దలు సర్దిజెప్పాల్సి వచ్చింది. ఇదే సమయంలో బోయ సామాజిక తరగతికి ప్రాధాన్యత కల్పించాలన్న డిమాండ్ వినిస్తోంది. ప్రధానంగా తెలుగుదేశం పార్టీలో సత్యసాయి జిల్లాలో బోయలకు ప్రాధాన్యత లేదన్న అభిప్రాయాన్ని ఆ కుల సంఘాల నాయకులు వ్యక్తం చేస్తున్నారు. 1980 దశకంలో గంగాధర్‌కు హిందూపురం ఎంపీగా అవకాశం ఇచ్చారు. ఆ తరువాత ఎవ్వరికీ తెలుగుదేశం పార్టీ ప్రాధాన్యతను కల్పించలేదన్న వాదనలను బోయలు వినిపిస్తున్నారు. ఆ పార్టీ ముఖ్య నేతల వద్ద కూడా ఈ అంశాన్ని లేవనెత్తినట్టు చర్చ నడుస్తోంది. వైసిపి మాత్రం రెండు బోయలు, కురబలు ఇద్దరికీ అధిక ప్రాధాన్యతను కల్పించామని చెబుతున్నారు. వడ్డేర్లు, యాదవలు ఇతర కుల సంఘాలు తమకు తగిన ప్రాధాన్యతను కల్పించలేదని చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రెండు కులాలకు అసెంబ్లీగాని, పార్లమెంటు స్థానాలుగానీ కేటాయించ లేదంటున్నారు. వచ్చే ఎన్నికల్లో తమ సామాజిక తరగతులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్‌ను వినిపిస్తున్నాయి. ఇక మైనార్టీలు, బలిజ సామాజిక తరగతికి చెందిన వారు కూడా తమకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ ముందుకు తెస్తున్నారు. గత ఎన్నికల్లో ఎప్పుడు ఏ సామాజిక తరగతికి

ప్రాధాన్యతలు ఏ విధంగా కల్పించారన్న బేరీజులు సైతం వేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రధాన పార్టీలు కొన్ని మార్పులతోనే టిక్కెట్లు కేటాయించే అవకాశాలున్నాయన్న చర్చ కూడా నడుస్తోంది. ఇలా ఎన్నికలకు ముందు కులాల కుంపట్లు మొదలయ్యాయి. ఈ ఎన్నికల సమయంలోనూ అభివృద్ధి, జిల్లా సమస్యల కంటే ఈ అంశాలు ముందుకు రావడం గమనార్హం. వామపక్షాలు అందులోనూ సిపిఎం జిల్లా సమగ్రాభివృద్ధిని ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. మేధావులతో సదస్సులు నిర్వహించారు. అదే విధంగా బస్సు యాత్ర, స్కూటర్ యాత్రలను చేపట్టింది. ఇందులో అభివృద్ధి ప్రధాన అజెండాగా ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేసింది.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

బుక్కరాసముద్రం నూతన యుటిఎఫ్ మండల కమిటీ సభ్యులు

విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయుల ధీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక పోరాటాలు నిర్వహిస్తామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య డిమాండ్ చేశారు. శనివారం నాడు యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో బుక్కరాయసముద్రం యుటిఎఫ్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. యుటిఎఫ్ బుక్కరాయసముద్రం మండలం అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గోవిందరాజులు, రమణయ్యలు ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడారు. విద్యారంగంలో అనేక సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. ఉపాధ్యాయులు స్వేచ్ఛా వాతావరణంలో పిల్లలకు విద్యా బోధన నేర్పే పరిస్థితులు లేవన్నారు. అనేక విద్యాయేతర కార్యక్రమాలు ఉపాధ్యాయులతో చేయిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించి, విద్యార్థులకు స్వేచ్ఛావాతావరణంలో పాఠాలు బోధించే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బుక్కరాయసముద్రం యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

యుటిఎఫ్ బుక్కరాయసముద్రం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షులుగా హెగ్రో మార్క్, అధ్యక్షులుగా ఎస్.మహమ్మద్ గౌస్, సహాధ్యక్షులుగా జి.శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సి.పవన్‌కుమార్, కోశాధికారిగా కె.బాబురావు, కార్యదర్శులుగా కుళ్లాయప్ప, నారాయణప్ప, దివాకర్‌రెడ్డి, పుల్లన్న, అనురాధ, రమేష్, జిల్లా మహాసభ ప్రతినిధులు సీతారామిరెడ్డి, దేవేంద్రమ్మ, అరుణమ్మ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కె.వెంకటనాయుడులను ఎన్నుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏవో సాయిలక్ష్మి

కె.సాయిలక్ష్మి

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారిగా కె.సాయిలక్ష్మి శనివారం నాడు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృ చేస్తానని తెలిపారు. బాధ్యతలు చేపట్టిన ఆమెకు వ్యవసాయ విస్తరణ అధికారి మురళికృష్ణ, సిబ్బంది శు భాకాంక్ష లు తెలిపారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు

క్రికెటర్ అంబటి రాయుడు

అంబటి రాయుడును సన్మానిస్తున్న ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని క్రికెటర్ అంబటి రాయుడు పిలుపునిచ్చారు. బుక్కరాయసముద్రం మండలం రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం స్వాగతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంబటి రాయుడుకు ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం ముసలమ్మ కట్ట వద్ద ఉన్న దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి యువ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో కళాశాల వరకూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కళాశాలకు చేరుకున్న అంబటిరాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఎస్ఆర్ఐటి కళాశాల కరస్పాండెంట్ ఆలూరు సాంబ శివారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కళాశాల యాజమాన్యం కల్పించే వివిధ సదుపాయాలను సక్రమంగా వినియోగించుకుంటూ, విద్యాపరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించి అభినందించారు. ఈకార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

జెఎన్‌టియు ఉపకులపతి రంగాజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులు సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని అభివృద్ధి సాధించాలని జెఎన్‌టియు ఉపకులపతి రంగాజనార్ధన పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్సు, ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో స్టూడెంట్స్ నేషనల్ లెవల్ సింపోయిజం పిక్సెల్ 2కె 23 జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సింపోయిజంలను నిర్వహించడం వల్ల విద్యార్థులు తమ విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ ఇ.అరుణకాంతి, కన్వీనర్ విభాగ అధిపతి కె.ఎఫ్.భారతి, కో కోఆర్డినేటర్లు ఎ.పి.శివకుమార్, జెస్సికా సరిత, వర్శిటీ డైరెక్టర్ బి.ఈశ్వరరెడ్డి, సి.శోభాబిందు, ఎ.సురేష్‌బాబు, జి.వి.సుబ్బారెడ్డి, కంప్యూటర్ సైన్సు విభాగం ప్యాకల్టీ పి.చెన్నారెడ్డి, కె.మాధవి, ఆర్.రాజశేఖర్, కళాశాల విభాగ అధిపతులు బి.దిలీప్‌కుమార్, ఎం.రామశేఖరరెడ్డి బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

ఇక్బాల్‌సాబ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నదీమ్

మైనార్టీ కమిషన్ ఛైర్మన్‌ను కలిసిన నదీమ్

అనంతపురం : జిల్లా పర్యటనకు వచ్చిన మైనార్టీ కమిషన్ ఛైర్మన్ ఇక్బాల్‌సాబ్‌ను ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహ్మద్ మర్యాద పూర్వకంగా కలిశారు. బొకే అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ముహెబ్, నాయకులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఉరవకొండ

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగం, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 27, 28వ తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పిఎం మోడీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలని ముఖ్యమంత్రి జగన్ తూచా తప్పకుండా పాటిస్తున్నారన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయే విధంగా కేంద్రం చట్టాలను తీసుకొస్తే 11 రాష్ట్రాలు వ్యతిరేకించాయన్నారు. అయితే సిఎం జగన్ మాత్రం ఒప్పుకోవడం బాధాకరమన్నారు. ఇందులో రైతులకు నష్టం కలిగించే వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు పెట్టే ప్రక్రియకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. ఆయా విధానాలను నిరసిస్తూ మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, రైతుసంఘం నాయకులు మురళి, రవికుమార్, వీరాంజనేయులు, సీనప్ప, సిద్ధప్ప, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : దేశవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ, రైతు సంఘాల పిలుపుమేరకు విజయవాడలో 27, 28వ తేదీల్లో నిర్వహించనున్న మహాధర్నాకు జిల్లా నుంచి వందలాదిగా కదిలిరావాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు మండల కేంద్రంలో వ్య.కా.సం, సిఐటియు, రైతుసంఘాల ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించినక కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాసులు, మండల కార్యదర్శి నాగేంద్రకుమార్, నాగలింగమయ్య, రైతుసంఘం జిల్లా నాయకులు పుల్లయ్య, నారాయణస్వామి, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెయు విసి బాధ్యతల స్వీకరణ

విసి సుధాకర్‌ను కలిసిన ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్‌గా చింతా సుధాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ మాట్లాడుతూ ఎస్‌కెయులో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించి విద్యార్థుల విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గిరి, శివ, బీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెయు విసితో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హింస రహిత సమాజాన్ని నిర్మించుకుందాం

ఐద్వా నాయకురాలు డాక్టర్ ప్రసూన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మహిళలపై దాడులు, హింస పెరిగిపోయింది. ప్రభుత్వాలతో పాటు సమిష్టిగా హింస రహిత సమాజాన్ని నిర్మించుకుందామని ఐద్వా నాయకురాలు డాక్టర్ ప్రసూన తెలిపారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసను వ్యతిరేకిస్తూ ఐద్వా, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో నారాయణ కళాశాలలో అంతర్జాతీయ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం నాడు సెమినార్ నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌కు ముఖ్య వక్తగా డాక్టర్ ప్రసూన హాజరై మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. జరుగుతున్న దాడులను వ్యతిరేకించాలన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో కళాశాలల్లో విద్యార్థులకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 25వ తేదీ నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా చట్టాలను పగడ్బందీగా అమలు చేయాలని, హింసలేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ జిల్లాలో ఆత్మకూరు మండలం, తలుపురు గ్రామంలో స్కూల్లో చిన్న పిల్లలపై ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించినట్లు ఈ మధ్య కాలంలోనే వెలుగులోకి వచ్చిందన్నారు. ఆ

సమావేశంలో మాట్లాడుతున్న డా॥ప్రసూన

ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. గత వారం క్రితం ఎర్రనాల కొట్టాలలో ఒక ఇంట్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ అధికారులకు పట్టుబడ్డారన్నారు. ఓ మైనర్ బాలికపైనా దాడి జరిగిందన్నారు. ఇలా మహిళలపై అనేక దాడులు, అకృత్యాలు జరుగుతున్నాయన్నారు. వీటిని నియంత్రించేలా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజనమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, నగర అధ్యక్ష కార్యదర్శులు భీమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెయు పూర్వ విసి అవినీతిపై విచారణ జరపాలి

విసి కార్యాలయం మెట్లపై పసుపునీళ్లు చల్లి ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నేతల నిరసన

పసుపునీళ్లతో ఎడి బిల్డింగ్‌ను శుభ్రం చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ రామకృష్ణారెడ్డి అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఓతురు పరమేష్, కుళ్లాయిస్వామిలు డిమాండ్ చేశారు. విసి రామకృష్ణారెడ్డి పదవీకాలం ముగియడంతో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐఎస్ఎ ఆధ్వర్యంలో శనివారం నాడు ఏడీ బిల్డింగ్ మెట్లను పసుపు నీళ్లతో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విసి రామకష్ణారెడ్డి మూడు సంవత్సరాలుగా యూనివర్సిటీని అన్ని విధాలా నాశనం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడారని విమర్శించారు. ఆయన హయాంలో కొన్ని డిపార్ట్‌మెంట్‌లో జీరో అడ్మిషన్ల స్థాయికి మార్చేశారంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను వేధిస్తూ కొంతమంది ఉద్యోగుల ప్రాణాలు కోల్పోవడానికి కూడా వైస్ ఛాన్సలర్ కారణమయ్యాడన్నారు. యూనివర్సిటీలో పని చేస్తున్న కొంత మంది వర్కర్లను విసి స్వగ్రామం వేంపల్లి పొలంలో పని చేయడానికి 10 రోజులకు ఐదు మంది వర్కర్లను తీసుకు వెళ్లేవారన్నారు. విసిగా కాకుండా అధికార పార్టీ కార్యకర్తగా ఆయన పని చేశారని విమర్శించారు. ఉన్నతాధికారులు ఈయన ఉద్యోగ సమయంలో జరిగిన ప్రతి పనిపైనా విచారణ జరిపి వాస్తవాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎ రాష్ట్ర అధ్యక్షులు వేమన, ఎస్ఎఫ్ఐ నాయకులు గిరి, శివ, భీమేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై రోడ్డెక్కిన వామపక్షాలు

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని బొమ్మలాటపల్లి మిట్ట మీద ఉన్న వికలాంగుల కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం వామపక్షాల ఆధ్వర్యంలో అనంతపురం-నార్పల ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ మండల కార్యదర్శులు కుళ్లాయప్ప, గంగాధర్ మాట్లాడుతూ వికలాంగుల కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. దీంతో చేసేది లేక కాలనీవాసులతో కలిసి ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వికలాంగుల కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని, లేనిపక్షంలో కాలనీవాసులను కలుపుకుని పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చంద్రమౌళి, అమీర్, సిపిఐ సుధాకర్, నాగరాజు, గోపాల్, రైతుసంఘం నాయకులు జోసెఫ్, సంజీవరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిద్దాం

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు), ఎస్‌కెయు న్యాయవిభాగం ఆధ్వర్యంలో 'రాజ్యాంగ స్ఫూర్తి-ఆటంకాలు-అమలు' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం దానికదే ఒక విప్లవం అన్నారు. రెండువేల సంవత్సరాలకుపైగా ఉన్న ఒక అసమాన వ్యవస్థ నిర్మాణాన్ని బద్దలు చేసిందన్నారు. అంతేగాకుండా కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా దేశంలోని ప్రజలందరినీ ఒక్కటి చేయగలిగిందన్నారు. అయితే కొంతకాలంగా రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీయడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగమే రాజ్యాంగ పీఠిక నుంచి 'సోషలిస్టు' (సామ్యవాద), 'సెక్యులర్' (లౌకికవాద) పదాలను తొలగించాలని సుబ్రమణ్యస్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం, పైగా తన వాదనకు బలం చేకూర్చుకోవడానికి సోషలిస్టు భావనను వ్యతిరేకించినట్టుగా అంబేద్కర్ మాటలను ఉటంకించారన్నారు. ఇది అంబేద్కర్‌ను పూర్తిగా తప్పుగా అర్థం చేసుకోవడమే అన్నారు. ప్రజలు నేడు స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే రాజ్యాంగ కల్పించిన హక్కులే కారణం అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, ఐలు జిల్లా గౌరవాధ్యక్షులు సీతారామరావు, విశ్రాంత న్యాయమూర్తి శివశంకర్, విశ్రాతం ప్రొఫెసర్ పుల్లారెడ్డి, ఐలు రాష్ట్ర సమితి సభ్యులు సూర్యచంద్ర, జిల్లా అధ్యక్ష కార్యదర్శి వీరుయాదవ్, సతీష్, జిల్లా నాయకులు బోయ పురుషోత్తం, నాగరాజు, ప్రకాష్, మల్లేష్‌గౌడ్, రవి, అశోక్, లోకేష్, సుదర్శన్, పురుషోత్తం, చంద్ర, శ్రీకాంత్, న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

వనమహోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం

రాయలసీమ బలిజ మహాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్తీక వనభోజనాల ఏర్పాట్లను జిల్లావ్యాప్తంగా తరలివచ్చిన బలిజ కులపెద్దలు శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఉదయం సోమలదొడ్డిలోని తడకలేరు అశ్వర్థనారాయణ వనంలో పర్యటించి వేదిక నారాయణ కట్టని పరిశీలించారు. అలాగే సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు భారీఎత్తున తరలివచ్చే బలిజ బంధువులకు పార్కింగ్, నీటివసతి, దీపాలు వెలిగించేందుకు అవసరమైన ప్రమిదలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ బలిజ మహాసంఘం అధ్యక్షులు పామూరి వెంకటేశ్, యువజన విభాగం అధ్యక్షులు రమేష్, పున్నం విజయభాస్కర్, రవికాంత్ రమణ, బళ్లారి వెంకటరాముడు, లీగల్‌సెల్ ఆది, పద్మజ, న్యాయవాది మురళి, సూరి, పసుపులేటి భారతి, కోనేటి సాయిప్రసాద్, కాపు రాక్స్ నేతలు ధ్రువ, రాజు, రవి, దండు శీను, పావురాల శేఖర్, రఘు, సోను, తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బలిజ సంఘం నాయకులు

నిరుపేదలకు అండగా 'ఆయుష్మాన్, ఆరోగ్యశ్రీ'

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలను పొందేందుకు ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఆరోగ్య పథకం వంటివి ఎంతగానో దోహదపడుతున్నాయని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. శనివారం నగరంలోని 38వ డివిజన్ పరిధిలో ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 'ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన(పిఎం-జేఎవై)' పథకం కింద ప్రతి ఏటా కార్డుదారులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల వరకు వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం డివిజన్ పరిధిలో రూ.29 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ పనులను మేయర్ పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్ఆర్‌సిపి నాయకులు భాజా, ఇక సూర్యనారాయణ, ఏఈ శంకర్‌తోపాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్డులు పంపిణీ చేస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

బాలికకు సంపూర్ణ న్యాయం చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం

బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దంపతులను కఠినంగా శిక్షించాలని అఖిలపక్ష నాయకులు, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం సప్తగిరి సర్కిల్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జనసేన నగర అధ్యక్షులు బాబురావు, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తర్, కాంగ్రెస్ నాయకులు ఇమామ్, ముస్లిం మైనార్టీ సంఘం నాయకులు నిజాం, ఎంఐఎం శ్యామ్, యాంటీకరప్షన్ ఫోర్స్ సరస్వతి మాట్లాడుతూ 12ఏళ్ల బాలికపై అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దంపతులు క్రూరంగా వ్యవహరించారని మండిపడ్డారు. మానవ సమాజం తలదించుకునే విధంగా దుశ్చర్యకు పాల్పడిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దంపతులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బాలికకు కార్పొరేట్ వైద్యంతోపాటు రూ.50లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ భాజా, 'హెల్పింగ్ హాండ్స్' షబ్బీర్, ఎంఐఎం దాదు, మసూద్, యాంటీ కరప్షన్ ఫోర్స్ షఫీ, టిడిపి ముస్లిం మైనార్టీ సిటీ అధ్యక్షులు హజీజ్, హ్యూమన్ రైట్స్ షఫీ, జనసేన నగర ప్రధాన కార్యదర్శులు దరాజ్ బాషా, హిమామ్ హుస్సేన్, హిద్దు తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర ప్రభుత్వం వచ్చేనెల 11వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ దివాకర్‌రెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని షాదీ మహల్‌లో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, క్రీడా వాలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటి ఆటలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 15ఏళ్లు నిండిన యువతీ యువకులు ఈనెల 27వ తేదీ నుంచి ఆయా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం నియోజకవర్గ ప్రభుత్వ కళాశాల పిఇటిలు, పీడీలు దివాకర్, రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి యువతీ, యువకులను ఎంపిక చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి అంజనప్రసాద్, ఎంఇఒ శ్రీదేవి, జిల్లా పరిషత్ హైస్కూల్, మోడల్ స్కూల్ పిఇటిలు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

దళితులపై వివక్ష చూపితే చర్యలు

కణేకల్లు : దళితుల పట్ల వివక్ష చూపితే చట్టపరమైన చర్యలు తప్పవని కళ్యాణదుర్గం ఆర్డీఓ నిస్సిత్, డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని బెణికల్లు గ్రామంలో ఈనెల 27వతేదీ నుంచి గంగొరి ఉత్సవాలు ప్రారంభం కానున్న క్రమంలో అగ్రవర్ణాలు, దళితుల మధ్య వివాదం మొదలైంది. ఈనేపథ్యంలో ఆర్డీఓ, డీఎస్పీ, రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్ కలిసి శనివారం కణేకల్లు తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగొరి పండుగ ఊరందరి పండుగ అన్నారు. అందరూ కలిసి కట్టుగా జరుపుకోవాలన్నారు. దళితుల పట్ల వివక్షచూపకుండా వారినీ కలుపుకుని పండుగ చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ రజాక్‌వలీ, ఎస్ఐ దుగ్గిరెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ వేడి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ వాతావరణమూ వేడెక్కుతోంది. నేతలతోపాటు, కుల సంఘాల్లోనూ కదలిక కనిపిస్తోంది. తమ సామాజిక తరగతులకు ప్రాధాన్యతను కల్పించాలని ఆయా కుల సంఘాలు డిమాండ్లను వినిపిస్తున్నాయి. ఇక రాజకీయ పార్టీల్లోనూ సమీకరణలు రోజురోజుకూ మారుతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలైన టిడిపి, వైసిపిల్లోనూ నేతలు తమ స్థానాలను పదిలం చేసుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ వారంలో జరిగిన రాజకీయ పరిణామాలు చూస్తే ఇదే రుజువు చేస్తున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంకు సంబంధించి పంచాయతీ టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు వద్ద జరగడం చర్చనీయాంశమైంది. ఇప్పటి వరకు రాయదుర్గం టిక్కెట్టు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పేరే వినిపిస్తూ వచ్చింది. రాయదుర్గం పర్యటన సమయంలోనూ కాలవ శ్రీనివాసులుకే టిక్కెట్టు ఉంటుందని చంద్రబాబు ప్రకటించారు. అయితే ఈ వారంలో చంద్రబాబు వద్దనే రాయదుర్గం నియోజకవర్గంపై దీపక్‌రెడ్డి, పూల నాగరాజులు కలసి చర్చించడం చర్చనీయాంశమవుతోంది. మార్పు చేయాలని పట్టుబట్టినట్లు రాజకీయవర్గాల్లో చర్చనడుస్తోంది. ఇదే సమయంలో ఇతర నియోజకవర్గాల్లోనూ మార్పులపై అసంతృప్తులు, ఆశావహుల సందడి మొదలైంది. ఇప్పుడున్న వారిని కాదని కొత్తవారికివ్వాలన్న డిమాండ్‌ను తెలుగుదేశం పార్టీలో వినిపిస్తోంది. ఇంకో వైపు కుల సంఘాలు రాజకీయ ప్రాధాన్యత కోసం సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఈ వారంలో కురబ సంఘం భారీ ప్రదర్శనను అనంతపురం నగరంలో చేపట్టింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఈ కార్యక్రమం జరిగినట్టు చర్చనడుస్తోంది. అయితే నేతలు పార్టీల వారీగా విడిపోయి గోరంట్ల మాధవ్, బికె.పార్థసారథి మధ్య వివాదం చోటు చేసుకోవడం గమనార్హం. అయితే ఆ సామాజికవర్గానికి సంబంధించిన వారు పెద్దఎత్తున పాల్గొన్నారు. అంతక మునుపు వాల్మీకిలు సభను నిర్వహించారు. పుట్టపర్తిలో వడ్డేర్లు తమకు అవకాశం కల్పించాలన్న డిమాండ్‌ను వినిపిస్తున్నారు. ఇలా అన్ని కుల సంఘాలు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తమ సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. హిందూపురం ప్రాంతంలో బోయలకు టిడిపికి ప్రాధాన్యత కల్పించాలన్న వాదనలు నేతల వద్ద జరుగుతుండటం గమనార్హం. ఇక వైసిపిలోనూ ఇదే రకమైన రాజకీయాలు చోటు చేసుకుంటున్నాయి. హిందూపురంలో కొత్త నియోజకవర్గ ఇంఛార్జీ దీపికను నియమించినప్పటి నుంచి ఎమ్మెల్సీ ఇక్బాల్ నియోజకవర్గానికి దూరంగా ఉంటూ వచ్చారు. ఇటీవలనే ఆయన నియోజకవర్గానికి వచ్చారు ఈ సమయంలో ఆయన ఘన స్వాగతం లభించింది. సామాజిక బస్సు యాత్రకు మించి జనాలు రావడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇలా ఈ వారంలో రాజకీయంగా కదలిక మొదలైంది. ఇక వామపక్షాలు రైతాంగా సమస్యలపై పోరాటాన్ని సాగిస్తున్నాయి. అనంతపురం జిల్లా కలెక్టరు కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో కరువు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. కరువు లెక్కింపులోనే కోతలు పెట్టడం సరైంది కాదని సిపిఎం చెబుతోంది. ఎకరానికి రూ.40 వేలు పరిహారమివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సిపిఐ కూడా కలెక్టరేట్ ఎదుట ఇదే డిమాండ్లపై నిరసన చేపట్టారు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ బ్రిడ్జి కూలడం కూడా ఈ వారంలో ప్రధాన అంశంగా ముందుకొచ్చింది.

'న్యాక్' సాధనకు కృషి చేయాలి

జెఎన్‌టియు విసి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు విశ్వవిద్యాలయానికి న్యాక్ సాధనకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలని ఉపకులపతి రంగజనార్ధన సూచించారు. శనివారం కళాశాలలోని మెకానికల్ సెమినార్ హాల్‌లో వర్శిటీ ఐక్యూ ఏ సెల్ ఆధ్వర్యంలో 'మైక్రో లెవల్ యాక్షన్ ప్లాన్ ఫర్ న్యాక్ పీర్ కమిటీ విసిట్ టూ జెఎన్‌టియు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాక్ గుర్తింపు వల్ల వర్శిటీ నాణ్యతా ప్రమాణాలను పెంపొందించుకోవచ్చన్నారు. న్యాక్‌లోని వివిధ క్రైటీరియాలను క్షుణ్ణంగా అందరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, ఐక్యూ ఏ సి డైరెక్టర్ సుబ్బారెడ్డి, వర్శిటీ డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు పదోన్నతులు

జెఎన్‌టియు విశ్వవిద్యాలయం బోధనా సిబ్బందికి సీఏఎస్ (కెరీర్ అడ్వాన్స్‌మెంట్ పథకం) ద్వారా పదోన్నతులు కల్పిస్తూ విసి జి.రంగజనార్ధన ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సి.శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారికి అభినందనలు తెలిపారు.

పూర్వ విద్యార్థులు మార్గదర్శకులు

పూర్వ విద్యార్థులే ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకులని జెఎన్‌టియు ఉపకులపతి రంగాజనార్ధన అన్నారు. శనివారం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రిన్సిపల్ ఎస్‌వి.సత్యనారాయణ అధ్యక్షతన 1979–83లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొనడం తన అదృష్టమన్నారు. మీ అనుభవాలు, మీ సలహాలు, సూచనలు ఎప్పటికీ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హెచ్.సుదర్శనరావు, నారాయణరెడ్డి, ఆనందరావు, టి.త్యాగరాజన్, వెంకటరామయ్య, సత్యనారాయణ, నారాయణరావు, అల్యూమినీ డైరెక్టర్ పి.సుజాత, వైస్ ప్రిన్సిపల్ ఇ.అరుణకాంతి, వి.శంకర్, ఎం.రామశేఖరరెడ్డి, అజిత, తదితరులు పాల్గొన్నారు.

ఒకచోట చేరిన జెఎన్‌టియు పూర్వ విద్యార్థులు

మహిళలు, బాలికలపై హింసను అరికట్టాలి

'అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం'లో వక్తలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను అరికట్టాలని ఆర్‌డిటి ఎటిఎల్ సుధాకర్ సూచించారు. అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని ఆర్‌డిటి కార్యాలయం నుంచి జడ్పీహెచ్ఎస్ స్కూల్, గురుకులం విద్యార్థులతో కలిసి బస్టాండ్ వరకూ ర్యాలీగా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిటి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా స్త్రీ హింసను నిర్మూలన దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఎన్ని చట్టాలు వచ్చినా ఆడపిల్లలపై అఘాయిత్యాలు, హింసలు, లైంగిక దాడులు, హత్యలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇందుకు ఉదాహరణ జిల్లాకేంద్రంలో వెలుగు చూసిన మైనర్ బాలికపై అత్యాచారం, హత్య అన్నారు. అనంతరం ఆర్డీటీ కార్యాలయంలో 60 మంది దంపతులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకులం బాలుర ప్రిన్సిపల్ ప్రభాకర్, ప్రజాశక్తి విలేకరి పెద్దన్న, ఆర్.ఇ.జ్యోతి, ఎఫ్ఒ ఆంజనేయులు, సీవోలు సాయిలీల, అమర్నాథ్‌రెడ్డి, ఆనంద్, సుధాకర్, కృష్ణారెడ్డి, చంద్ర, వన్నూరుస్వామి, ఉపాధ్యాయులు షాహినాబేగం, పీరూనాయక్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : సమాజంలో మహిళలపై చులకనభావం వీడాలని ఆర్డీటీ ఎటిఎల్ నారాయణ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని టిటిడి కళ్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా మండలంలోని ప్రయివేటు పాఠశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర చాలా కీలకమన్నారు. వీటిని తగ్గించడానికి ప్రతి కుటుంబంలో మార్పు రావాలన్నారు. మహిళలు, పురుషులు ఇద్దరూ సమానమే అన్నారు. నేటి సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో ముందుంటున్నారు. అనంతరం మహిళల పట్ల గౌరవంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఓలు నాగమణి, మంజుల, శాంతి, రాజు, గంగాధర్, లాలుస్వామి, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రంలో మాట్లాడుతున్న ఆర్‌డిటి ఎటిఎల్ సుధాకర్

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం

ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు రాయదుర్గం మాస్ ఎడ్యుకేషన్ అండ్ ఆర్గనైజేషన్ సొసైటీ, ప్రభుత్వ వైద్యశాల ఐసీటీసీ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఎయిడ్స్, హెచ్ఐవిపై స్థానిక పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళు శిల్ప మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచుకుని ప్రతి ఒక్కరూ కూడా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ హెచ్ఐవి వైరస్ నాలుగు రకాలుగా వ్యాపిస్తుందన్నారు. సురక్షితంకానీ లైంగిక సంబంధాలు, కలుషిత సూదుల వినియోగం, కలుషిత రక్త మార్పిడి ద్వారా, తల్లి నుండి బిడ్డకు హెచ్ఐవి వచ్చే అవకాశం ఉందన్నారు. ఎయిడ్స్ వ్యాధి బారిన పడిన వ్యక్తులకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా మందులు లభిస్తాయని తెలిపారు. మాస్ ఎడ్యుకేషన్ అండ్ ఆర్గనైజేషన్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ అశోక్ మాట్లాడుతూ హెచ్ఐవి సోకిన వ్యక్తిని వివక్షకు గురిచేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు సభ్యురాలు శారదా, శానిటరీ ఇన్స్‌పెక్టర్ జగదీష్, సచివాలయ సిబ్బంది రాముడు, కృష్ణమూర్తి, రవికుమార్, ఓంకార్, మున్సిపల్ సిబ్బంది రంగప్ప, మాస్ ఎడ్యుకేషన్ సిబ్బంది లోకేష్, నాగమణి, సుధ, ఇందిరమ్మ, ఉషా, సత్యమ్మ, వరలక్ష్మి, ఉషారాణి, లక్ష్మీదేవి, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పుట్లూరు : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాలన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎయిడ్స్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఈమేరకు ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఇందులో భాగంగా ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ జగన్నాథరెడ్డి, ఒఆర్‌డబ్ల్యు రవికుమార్, రంగేశ్వరి, కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సాయివైష్ణవికి డాక్టరేట్ ప్రదానం

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని బయో టెక్నాలజీ విభాగంలో పరిశోధన చేసిన జి.సాయివైష్ణవి శుక్రవారం డాక్టరేట్ అందుకున్నారు. డాక్టర్ డి.మురళీధర్‌రావు పర్యవేక్షణలో 'బయో టెక్నాలజికల్ ప్రొడక్షన్ ఆఫ్ ఎథిలైన్ గ్లైక్రోల్ బై కాల్డిసెల్యూ సిర్స్ టర్ సాచిరోలైటికస్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంత ర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

ఉరవకొండ : నేటి యువత విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఉరవకొండ అర్బన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ తిమ్మయ్య పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఉరవకొండ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఓపెన్ బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శరీర ధృఢత్వాన్ని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గడేహోతూర్ హెచ్ఎం షాహిన్, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం బాషా, జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు ఖలందర్, సిరాజ్, బషీర్, ఎర్రిస్వామి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం మీదుగా హంపీ ఎక్స్‌ప్రెస్

రాయదుర్గం : హుబ్బళ్లి నుండి గుంతకల్లు మీదుగా మైసూర్ మధ్య ప్రయాణించే హంపీ రైలు రాయదుర్గం మీదుగా ప్రయాణించనున్నట్లు నైరుతి రైల్వే అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్ బిఎల్ శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశాంతి నిలయం (పుట్టపర్తి) బసన్నపల్లె స్టేషన్‌లో నడుమ రైలు మార్గం మరమ్మతులు నడుస్తున్న దృష్ట్యా రెండు నెలలపాటు నవంబర్ 30వ తేదీ నుండి 2024 సంవత్సరం జనవరి 31వ తేదీ వరకూ హంపీ ఎక్స్‌ప్రెస్ రైలు అనంతపురం, గుంతకల్లు మీదుగా కాక చిక్కజారీరు, రాయదుర్గం, బళ్లారి కంటోన్‌మెంట్ మీదుగా ప్రయాణిస్తుందన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

రాయదుర్గం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న మండల వనరుల కేంద్రం ప్రాంగణంలో శనివారం ఐక్య ఉపాధ్యాయ సంఘం (యుటిఎఫ్) డి.హీరేహాల్ మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నికైంది. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకునానరు. గౌరవాధ్యక్షులుగా టి.హనుమంతప్ప, అధ్యక్షులుగా ఆర్.మోహన్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా జి.రామాంజనేయులు, సహాధ్యక్షులుగా రామచంద్రప్ప, ఎ.కుసుమావతి, మండల కోశాధికారిగా బి.వన్నూరప్ప, కార్యవర్గ సభ్యులుగా తిప్పేస్వామి, దివాకర్, లోకాభిరాముడు, జిల్లా మహాసభ ప్రతినిధులుగా హరి, రాధారాణి, కరీం, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వెంకోబ్‌రావు, ఆడిట్ కమిటీ సభ్యులుగా జయసింహా, స్వామినాథరెడ్డిని ఎన్నుకున్నారు.

సిఎం సహాయనిధి పంపిణీ

ఉరవకొండ : వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి స్వగృహంలో పలువురు బాధితులకు మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. బెళుగుప్ప మండలం దుద్దేకుంటకు చెందిన గుడిపూటి రమాదేవికి రూ.90వేలు, విడపనకల్ మండలం కడదరబెంచికి చెందిన అరుడప్పగారి రాజమ్మకు రూ.65వేలు, పాత గుంతకల్లుకు చెందిన తుంగా భాగ్యలక్ష్మికు రూ.2లక్షలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రమణారెడ్డి, రమణయాదవ్, దుద్దేకుంట ఎం.సూరి, జె.తిరుపాల్‌యాదవ్, తిప్పారెడ్డి, కాకర్ల నాగేశ్వరరావు, మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ సోమర జయచంద్రనాయుడు, కొనకొండ్ల రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు కిందపడి వృద్ధుడు ఆత్మహత్య

చిన్న నారాయణ (పాతచిత్రం)

తాడిపత్రి రూరల్ : రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం తాడిపత్రి రూరల్ పరిధిలోని ఆటోనగర్ వద్ద చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాడిపత్రి పట్టణంలోని నందలపాడుకు చెందిన కాయపాటి చిన్ననారాయణ (80) ఆరోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామనీ గుత్తి రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పెద్దవడుగూరు : మండలంలోని మిడుతూరు వద్ద 44వ జాతీయ రహదారిలో మూతబడ్డిన ఓ హోటల్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గమణించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు లుంగీతో ఉండి 45ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. ఎవరైనా చంపి ఇక్కడ పడవేశారా.. లేక ఆత్మహత్య చేసుకున్నాడా.. తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న సీఐ శంకరరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

ప్రమాదంలో చిన్నారి...

గార్లదిన్నె : మండల కేంద్రంలోని రైల్వే ట్రాక్ సమీపంలో శనివారం జరిగిన బొలేరో వాహన ప్రమాదంలో దాక్షాయిని (3) మృతిచెందింది. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం చిన్నారి చిన్నాన్న రంగనాయకులు బొలేరో వాహనం స్టార్ట్ చేసి ముందుకు నడుపుతుండగా వెనుకవైపు ఆడుకుంటున్న చిన్నారి టైరు కిందికి దూరడంతో తల పగిలి అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో తండ్రి బాలాజీ, తల్లి భారతి, చిన్నారి కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

పెద్దవడుగూరు : బళ్లారి రాఘవ అవార్డు పొందిన మండల పరిధిలోని విరుపాపురం గ్రామంలో తెలుగు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చిదంబర్‌రెడ్డిని శనివారం మండలంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కుళ్లాయిస్వామి, ఎంఇఒలు రాముడు, గురుప్రసాద్ మాట్లాడుతూ చిదంబరరెడ్డి విద్యాశాఖ విద్యాభివృద్ధికి పెంపొందించడంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం సంతోషకరమన్నారు.

'పయ్యావుల'ను కలిసిన లక్ష్మినరసింహులు

అనంతపురం : అనంతపురం పార్లమెంటు టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన పోతుల లక్ష్మీనరసింహులు శనివారం నగరంలోని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను స్వగృహంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం నాగభూషణం, నగర అధ్యక్షులు పూల బాషా, టైలర్స్ యూనియన్ అధ్యక్షులు ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష'

అనంతపురం : జిల్లావ్యాప్తంగా సెప్టెంబర్ 30 నుంచి నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం ముగిసినట్లు డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఇబి.దేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

డిజిటల్ టెక్నాలజీపై అవగాహన

గుత్తి : గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 'డిజిటల్ టెక్నాలజీస్, ఇండస్ట్రీ ఎక్స్‌పెక్టేషన్స్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టిసిఎస్ కంపెనీ క్లౌడ్ యూనిట్ డెలివరీ హెడ్ శ్రీనివాస రామానుజన్ ఇండస్ట్రీ 4.0, సోషల్ మీడియా, మొక్స్, క్లౌడ్ కంప్యుటింగ్, ఐ ఓ టీ, డేటా అనలిటిక్స్ ఎఐ, వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల అవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి జి.రఘునాథరెడ్డి, ప్రిన్సిపల్ సురయ, ఫ్యాకల్టీ ఇంతియాజ్‌బాషా, సిఎస్ఇ విభాగాధిపతి నమ్రత, తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాలను అరికట్టాలని వినతి

రాయదుర్గం : పట్టణంలోని మోడల్ కాలనీ బిటిపి లేఔట్‌లో మున్సిపల్ వార్డు సభ్యుని భూకబ్జాను అరికట్టాలని బీఎస్పీ, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. బీఎస్పీ రాయదుర్గం తాలూకా అధ్యక్షుడు టి.ఉలుగప్ప, సిపిఐ నాయకుడు దుర్గప్ప తదితరులు శనివారం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ సురేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

లింగవివక్షపై అవగాహన

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో సీసీ రాజ్యలక్ష్మి, ఎపిఎం రవిచంద్రరాజు ఆధ్వర్యంలో లింగవివక్షపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడటం ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చూసుకోవాలన్నారు. ఏ రంగంలోనైనా ఆడపిల్లలు రాణిస్తున్నారన్నారు. కావున ఆడపిల్ల అంటే చిన్నచూపు చూడకూడదన్నారు. అలాగే బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేయడం వల్ల వారికి పుట్టబోయే బిడ్డలు బలహీనంగా ఉంటారన్నారు. కావున బాల్య వివాహాలను చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో విఒఎలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

పుట్లూరు : మండల పరిధిలోని అరకటవేముల, కడవకల్లు గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ యోగానందరెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా అటెండెన్స్, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి లాగిన్ చేయించడం, ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు చేయించడం, పెన్షన్లు పంపిణీ ఎలా పంపిణీ చేస్తారు.. అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఇన్‌ఛార్జి ఎస్ఇగా రామ్మోహన్‌రెడ్డి



అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా రామ్మోహన్‌రెడ్డి శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న రామ్మోహన్‌రెడ్డికి ఇన్‌ఛార్జి ఎస్ఇగా అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో ఈయనకు మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేసిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సూర్యనారాయణ, డిఇఇలు సుభాష్, రవీంద్రారెడ్డి, ఎఇ శంకర్, తదితరులు రామ్మోహన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

టిడిపికి పెరిగిన ప్రజాదరణ : కాలవ

రాయదుర్గం : రోజురోజుకూ తెలుగుదేశం పార్టీపై ప్రజల్లో ఎనలేని ఆదరణ లభిస్తోందని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని 5వ వార్డులో 'బాబు షూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌రెడ్డి ఆరాచకపాలనతో అన్నివర్గాల ప్రజలు విసిగిపోయారన్నారు. నాలుగున్నరేళ్లలో ఆరుసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచడంతో సామాన్యుల జీవనాలు దుర్భరంగా మారాయన్నారు. నవరత్నాల పేరుతో అమాయక ప్రజలను నమ్మించి, గెలిచిన జగన్ అరకొర సంక్షేమ పథకాలతో దారుణంగా మోసం చేస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, 5వ వార్డు ఇన్‌ఛార్జి మహబూబ్‌బాషా, 5వ వార్డు బి.ఎల్.ఎ పాండు, కౌన్సిలర్ ప్రశాంతి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ వెంకటేశులు, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, మైనార్టీ సెల్ జమీల్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి ఇనాయత్ బాషా, మాజీ కౌన్సిలర్ సుమలత, ధనార్జున, వెంకటేశులు, ఎస్సీ సెల్ మల్లి, అంజి, తిప్పేస్వామి, రవి, బసవరాజు, శివ, వెంకటేశులు, యల్లప్ప, ప్రహ్లాద, తదితరులు పాల్గొన్నారు.